క్లుప్తంగా

4న అల్లూరి జయంతి



మధురానగర్(విజయవాడసెంట్రల్): మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలను విజయవాడ క్షత్రియ యువజన సంఘం, క్షత్రియ సేవా సంఘం సంయుక్త ఆధ్వర్యంలో కుల, మతాలు, రాజకీయాలకు అతీతంగా జూలై 4న నిర్వహిస్తామని క్షత్రియ యువజన సంఘం అధ్యక్షుడు మిధిలేష్ వర్మ, యువజన సంఘం ప్రధాన కార్యదర్శి రాజు క్లోపల్లి తెలిపారు. క్షత్రియ సేవా సంఘం కార్యాలయంలో గురువారం అల్లూరి సీతారామరాజు 128వ జయంతి వేడుకల కరపత్రాల ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. వారు మాట్లాడుతూ అల్లూరి జయంతి వేడుకలలో అల్లూరి సీతారామరాజు అభిమానులు, దేశభక్తులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. క్షత్రియ సేవా సంఘం ఉపాధ్యక్షుడు పెనుమత్స అప్పలరాజు, ప్రధాన కార్యదర్శి విజయరామరాజు తదితరులు పాల్గొన్నారు.

వారాహి నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం




మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు షిర్డీ సాయిబాబా మందిరంలో గురువారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వారాహి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. మందిర గౌరవాధ్యక్షుడు డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి వారాహి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎంతో మహిమాన్వితమైన అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరికీ అందాలని, ప్రజలు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని వారాహీ నవరాత్రి పూజలు చేస్తున్నామన్నారు. ప్రతి రోజు ఉదయం 7.30 గంటలకు విశేషంగా లలితా సహస్రనామ పారాయణం, ప్రత్యేక అర్చనలు, పూజలు జరుగుతాయని చెప్పారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ జరిగింది.

భవన నిర్మాణ కార్మికుల నిరసన



మధురానగర్(విజయవాడసెంట్రల్): కూటమి ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించి, సంక్షేమ బోర్డు పునరుద్ధరించి ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు ఎ. వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) సెంట్రల్ సిటీ కమిటీ ఆధ్వర్యంలో గురువారం మాచవరం ఎస్ఆర్ఆర్ కళాశాల సమీపంలో భవన నిర్మాణ కార్మికులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ లేబర్ కోడ్లు రద్దు చేయాలని కోరుతూ జూలై 9న జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. సీఐటీయూ నగర కార్యదర్శి ఎం. బాబూరావు, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి బి. గోవిందు మాట్లాడారు. బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ సెంట్రల్ సిటీ ఉపాధ్యక్షుడు జి. కృష్ణ, కమిటీ సభ్యులు జి. రామకృష్ణ, హరిబాబు, రాంబాబు, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

చినుకు పడితే రోడ్లు మునకే



మధురానగర్(విజయవాడసెంట్రల్): చిన్నపాటి వర్షానికే రోడ్డుపై వర్షం నీరు నిలుస్తోంది. గురువారం రాత్రి ఒక్కసారిగా కురిసిన వర్షానికి శారద కళాశాల రోడ్డుపై వర్షం నీరు నిలిచింది. ఇక్కడ రోడ్డు డౌన్ అవడంతో చినుకుపడితే బయటకు పోయే మార్గం లేక స్థానికులు ఇబ్బందులకు గురవుతున్నారు. మధురానగర్ ఆర్‌యూబీ సర్వీసు రోడ్డు బురదగా మారింది. అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

దుర్గాఘాట్‌లో హాకర్స్ నియంత్రణకు చర్యలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గాఘాట్‌లో హాకర్లు, చిరు వ్యాపారుల నియంత్రణకు ఆలయ అధికారులు చర్యలు ప్రారంభించారు. దుర్గాఘాట్‌లో హాకర్లు, చిరు వ్యాపారులకు కేటాయించిన స్థలాలను గురువారం ఆలయ అధికారులు కొలతలు వేశారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ రంగారావు పర్యవేక్షణలో ఇంజనీరింగ్, లీజెస్ అధికారులు దుర్గాఘాట్‌ను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఘాట్‌లో ఎంత మంది వ్యాపారులు ఉన్నారు...ఎంత మందికి పర్మిషన్ ఉంది. ఎంత మంది అద్దెలు చెల్లిస్తున్నారనే అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అనేకమంది వ్యాపారులు అద్దె బకాయిలు ఉన్నట్లు గుర్తించి, నెలాఖరు నాటికి చెల్లించాలని ఆదేశాలు జారీ చేశారు. జులై 1వ తేదీ నాటికి అద్దె బకాయిలు చెల్లించిన వారికి మాత్రమే అమ్మకాలు జరుపుకునేందుకు అనుమతి ఇస్తామని ఆలయ అధికారులు స్పష్టం చేశారు.

చెంతనే ఉన్నా.. నీటికి చింతే

- పూర్తయిన ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణం
- నత్తనడకన పైపులైన్ పనులు
- ఏర్పాటు చేయని మోటార్లు
- కృష్ణా జలాల కోసం జీవీఆర్ నగర్, డీబీ కాలనీ వాసుల ఎదురుచూపులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): కృష్ణానది చెంతనే ఉన్నప్పటికీ కృష్ణా జలాల కోసం జీవీఆర్‌నగర్, దావు బుచ్చయ్య కాలనీ, వినాయకనగర్ వాసులు ఎదురుచూస్తున్నారు. ఈ ప్రాంతంలో రోజురోజుకు నివాసాలు పెరుగుతూ వేగంగా అభివృద్ధి చెందుతోంది. దీంతో గత ప్రభుత్వం జీవీఆర్ నగర్, దావు బుచ్చయ్య కాలనీ, వినాయక నగర్ ప్రాంత వాసులకు కృష్ణా జలాలు అందించేందుకుగానూ రూ. 3.30 కోట్ల వ్యయంతో ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మించేందుకు నిధులు మంజూరు చేశారు. అలాగే గంగిరెద్దుల దిబ్బ నుంచి జీవీఆర్ నగర్ వాటర్ ట్యాంక్ వరకు రూ. 3.29 కోట్ల వ్యయంతో 40 ఎంఎం మంచినీటి సరఫరా పంపింగ్ మెయిన్ పనులు పూర్తి చేశారు.

అయితే ఇక్కడ వాటర్ ట్యాంక్ నిర్మించేందుకు అవసరమైన స్థలం లేకపోవటంతో అధికారులు, రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులతో మాట్లాడి టీడీఆర్ బాండ్లు ఇచ్చి, ప్రైవేటు స్థలం సేకరించి వాటర్ ఓవర్ హెడ్ ట్యాంక్ పనులు ప్రారంభించారు. పనులు తుది దశకు చేరుకునే సమయంలో ఎన్నికలు రావడం.. ప్రభుత్వం మారటం జరిగింది.



నిర్మాణం పూర్తయిన ఓవర్ హెడ్ ట్యాంక్

నత్తనడకన పనులు

తుది దశకు చేరిన ఓవర్ హెడ్ వాటర్ ట్యాంక్ పనులు ఏడాది పాటుగా నత్తనడకన సాగుతున్నాయి. ఎట్టకేలకు వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులు సైతం పూర్తయ్యాయి. ఇక కృష్ణా జలాలు వస్తాయని స్థానికులు ఆనంద పడ్డారు. అయితే ఓవర్‌హెడ్ వాటర్ ట్యాంక్‌లో అవసరమైన మోటార్లు ఇప్పటికీ ఏర్పాటు చేయలేదు. అలాగే ఓవర్ హెడ్ ట్యాంక్ నుంచి ఇళ్లకు సరఫరా చేసే వాటర్ పైపులైన్ పనులు నత్తనడకన సాగుతున్నాయి. కూటమి ప్రభుత్వం ఓవర్ హెడ్ ట్యాంక్‌ను వేసవిలో ప్రారంభించి ప్రజలకు కృష్ణా జలాలు అందిస్తామని హామీ ఇచ్చారు. కానీ వేసవి వెళ్లిపోయి వర్షాకాలం వచ్చినప్పటికీ ఓవర్ హెడ్ ట్యాంక్ ఇప్పటికీ వినియోగంలోకి రాలేదు.



జీవీఆర్ నగర్‌లో వాటర్ పైపులైన్ పనులు

ఆదాయం కోల్పోతున్న వీఎంసీ

ఇక్కడ వాటర్ ట్యాంక్, పైపులైన్ పనులు తుది దశకు చేరుకున్న సమయంలో పనులు వేగవంతం చేసి వినియోగంలోకి తీసుకువస్తే నగర పాలక సంస్థకు ఆదాయం పెరిగే అవకాశం ఉంది. అధికారుల నిర్లక్ష్యం వల్ల వాటర్ ట్యాక్స్ ద్వారా రావాల్సిన ఆదాయాన్ని నగర పాలక సంస్థ కోల్పోతోంది. అసలే ఆర్థిక సమస్యలతో ఉన్న వీఎంసీ ఇక్కడ వాటర్ ట్యాంక్‌ను ప్రారంభించడం ద్వారా ఆదాయం పెంచుకునే అవకాశం ఉన్నప్పటికీ పట్టించుకోవడం లేదని స్థానికులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి పనులు వేగవంతం చేసి సాధ్యమైనంత త్వరలో కృష్ణాజలాలు పంపిణీ చేయాలని కోరుతున్నారు.

డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణమే ధ్యేయం

ఏలూరు రోడ్డులో డ్రగ్స్‌కు శవయాత్ర

మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నవజీవన్ బాలభవన్, కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నవజీవన్ బాల భవన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఫాదర్ పి. తంబీ జోసెఫ్ మాట్లాడుతూ మాదకద్రవ్యాలకు బానిసలైన వారికోసం చికిత్సా కేంద్రాలను నవ జీవన్ స్వచ్ఛంద సంస్థలు నిర్వహిస్తున్నాయని చెప్పారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. భాగ్యలక్ష్మి మాదకద్రవ్యాలు తీసుకోవటం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. మత్తు పదార్థాలు, డ్రగ్స్ తీసుకోవటం వల్ల శవంగా మారుతారని తెలియచేసే విధంగా విద్యార్థులు శవయాత్ర నిర్వహించారు. కళాశాల ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ కె. రమేష్, అధ్యాపకులు డాక్టర్ బాలసుబ్రహ్మణ్యం, నవజీవన్ బాలభవన్ ప్రోగ్రాం మేనేజర్ గోళ్లమూడి శేఖర్‌బాబు పాల్గొన్నారు.

మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అవగాహన సదస్సు, ర్యాలీ నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎస్. కృష్ణకాంత్, వైస్ ప్రిన్సిపాల్ టి. ఆర్యాపతి మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. అనంతరం ఏలూరు రోడ్డులో బీఎస్ఎన్ఎల్ కార్యాలయం వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు



ఎస్ఆర్ఆర్ కళాశాలలో మాదక ద్రవ్యాల శవయాత్ర నిర్వహిస్తున్న విద్యార్థులు

గురుకుల మహిళా కళాశాలలో..

మాచవరం ఎస్ఆర్ఆర్ఆర్ కళాశాల ప్రాంగణంలోని కంచికచర్ల గురుకుల మహిళ కళాశాలలో అవగాహన కార్యక్రమం జరిగింది. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వల్లూరు నీరజ డ్రగ్స్, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు.

ప్రభుత్వ ఉద్యోగిపై టీడీపీ నాయకుడి దాడి

- రాజీ చేసిన పోలీసులపై ఉద్యోగుల ఆగ్రహం
- విధుల్లో ఉన్న పోలీసును కొడితే ఊరుకుంటారా అంటూ మండిపాటు

భవానీపురం(విజయవాడపశ్చిమ): విధుల్లో ఉన్న ఒక ప్రభుత్వ ఉద్యోగిపై తెలుగుదేశం పార్టీకి చెందిన నాయకుడు దాడి చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సేకరించిన సమాచారం మేరకు.... భవానీపురం 41వ డివిజన్ అధ్యక్షుడిగా సూదాబత్తుల సంతోష్ కుమార్ ఇటీవల నియమితుడయ్యాడు. అలాగే జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) డైరెక్టర్‌గా కూడా నామినేట్ చేయబడి ఈ నెల 27న ప్రమాణ స్వీకారం చేయనున్న సందర్భాన్ని పురస్కరించుకుని విద్యాధరపురం, భవానీపురం ప్రాంతాల్లో ఫ్లెక్సీలు కట్టించాడు. ఈ క్రమంలో పశ్చిమ తహసీల్దార్ కార్యాలయం సమీపంలో కట్టించిన ఫ్లెక్సీలను స్థానిక సచివాలయం ప్లానింగ్ సెక్రటరీ సుగుణ తేజ, సిబ్బంది బుధవారం తొలగిస్తున్నారు. విషయం తెలిసిన సంతోష్ కుమార్ కొందరు స్నేహితులతో అక్కడకి వచ్చి ఫ్లెక్సీలను తొలగిస్తున్నవారితో ఘర్షణకు దిగాడు. రెండు రోజుల్లో ప్రమాణ స్వీకారం చేయనుండగా అప్పుడే ఎలా తొలగిస్తారంటూ సుగుణ తేజ, సిబ్బందిపై దాడికి తెగబడి కొట్టారు.

జరిగిన విషయాన్ని ఉన్నత అధికారులకు ఫోన్‌లో తెలియ చేస్తున్న సుగుణ తేజపై సంతోష్ కుమార్ అండ్ గ్యాంగ్ మరోమారు దాడి చేయడంతో అతను కిందపడిపోయారు. దీనిపై ఆగ్రహం చెందిన భవానీపురం, విద్యాధరపురం సచివాలయ ఉద్యోగులు సుగుణ తేజతో కలిసి భవానీపురం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసి దాడికి పాల్పడ్డవారిపై చర్యలు తీసుకోవాల్సిన పోలీసులు ఇరు వర్గాలను కూర్చో బెట్టి రాజీ చేయడం విమర్శలకు దారి తీస్తుంది. కొట్టింది అధికార పార్టీకి చెందిన వ్యక్తి కాబట్టి పోలీసులు ఒత్తిడికి తలొగ్గి సంతోష్ కుమార్‌తో సచివాలయ ఉద్యోగి సుగుణ తేజకు క్షమాపణ చెప్పించి ఫిర్యాదును వెనక్కి తీసుకునేలా చేయడంపై సచివాలయ ఉద్యోగులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విధుల్లో ఉన్న ప్రభుత్వ ఉద్యోగిపై దాడి చేసి కొట్టినవారిపట్ల పోలీసులు ఉదాసీన వైఖరి అవలంభించటం ఏమిటని సచివాలయ ఉద్యోగులు ప్రశ్నిస్తున్నారు. అదే విధుల్లో ఉన్న పోలీస్‌పై ఎవరైనా దాడి చేస్తే ఊరుకుంటారా అంటూ మండిపడుతున్నారు. అధికార పార్టీకి చెందినవారికి ఒక న్యాయం, ప్రభుత్వ ఉద్యోగులు, సామాన్యులకు ఒక న్యాయమా అంటూ వ్యాఖ్యానిస్తున్నారు.

రేపు పీవీ నరసింహారావు విగ్రహావిష్కరణ

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): దివంగత మాజీ ప్రధాని పీవీ నరసింహారావు జయంతిని పురస్కరించుకుని ఈ నెల 28న సాయంత్రం 4 గంటలకు బీఆర్టీఎస్ రోడ్డు, రామకోటి దేవాలయం సమీపంలో ఆయన విగ్రహావిష్కరణ జరుగుతుందని మాజీ ఎమ్మెల్యే, మల్లాది వెంకట సుబ్బారావు చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ మల్లాది విష్ణు తెలిపారు. విగ్రహావిష్కరణ ఏర్పాట్లను గురువారం స్థానిక కార్పొరేటర్ శర్వాణిమూర్తితో కలిసి మల్లాది విష్ణు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రధానిగా, దేశ ఆర్థిక సంస్కరణల రూపశిల్పిగా, యావత్ భారత దేశం గర్వంచదగిన నేతగా పీవీ నరసింహారావు దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. మల్లాది వెంకట సుబ్బారావు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విగ్రహం ఏర్పాటు చేసుకోవడం గర్వ కారణమన్నారు. విగ్రహావిష్కరణ కార్యక్రమానికి మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్, మాజీ శాసన సభ్యులు కోన రఘుపతి, పలువురు మాజీ శాసన సభ్యులు, నగర మేయర్, కార్పొరేటర్లు, అధికారులు, పలు సామాజిక వర్గాలకు చెందిన నాయకులు, మేధావులు, ఉపాధ్యాయులు హాజరవుతారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు దోనేపూడి శ్రీనివాసరావు, చల్లా సుధాకర్, రామకృష్ణ, బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు బలరామ్ పాల్గొన్నారు.



విగ్రహావిష్కరణ ఏర్పాట్లను పరిశీలిస్తున్న విష్ణు

49 మందికి జరిమానా

విజయవాడలీగల్: నగరంలో మద్యం సేవించి వాహనాలు నడిపిన 49 మందికి న్యాయస్థానం జరిమానా విధించింది. విజయవాడ నగర పోలీసు కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు ఆదేశాల మేరకు నగరంలో మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న 49 మందిపై ఐదో ట్రాఫిక్ పోలీసులు కేసులు నమోదుచేశారు. 49 మందిని కోర్టులో హాజరుపరచగా, న్యాయమూర్తి లెనిన్‌బాబు 10 మందికి ఒక్కొక్కరికి రూ.15 వేల చొప్పున, మిగిలిన 39 మందికి ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున జరిమానా విధించారు.

'డీజీ లక్ష్మి'లకు సాంకేతికతపై ఆన్‌లైన్‌లో శిక్షణ

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగర పాలక సంస్థ సర్కిల్ -3 పరిధిలో డిజి లక్ష్మిలో నమోదైన పొదుపు సంఘాల సభ్యులకు గురువారం మెప్మా ఆధ్వర్యంలో ఆన్‌లైన్‌లో శిక్షణ ఇచ్చారు. వీఎంసీ పట్టణ సాధికార విభాగం ప్రాజెక్ట్ అధికారి పి. వెంకట నారాయణ మాట్లాడుతూ మెప్మా ఆధ్వర్యంలో జరిగే శిక్షణలో డిజీ లక్ష్మి విధి విధానాలు, ప్రజలకు ఎలా అవగాహన కల్పించాలి, ఏవిధంగా డిజి లక్ష్మి కార్యక్రమాలు నిర్వహించాలి తదితర అంశాలను వివరించారు. స్వయం సహాయక బృందాల సభ్యులను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ఇదొక మంచి అవకాశమన్నారు. ఈ కార్యక్రమం ద్వారా సాంకేతికతపై అవగాహన పెరగడమే కాకుండా ఆర్థిక అభివృద్ధి కూడా జరుగుతుందని చెప్పారు. విజయవాడ నగర పాలక సంస్థ, యూసీడీ విభాగం సీడీఓలు, టెక్నికల్ అసిస్టెంట్, సీఓలు, సోషల్ వర్కర్లు, సీఎల్ఆర్‌పీలు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం



పాయకాపురం(విజయవాడరూరల్): విద్యార్థులు చదువుతో పాటు ఆటలు, సాంస్కృతిక రంగాల్లో రాణించాలని 64వ డివిజన్ కార్పొరేటర్ యర్రగొర్ల తిరుపతమ్మ అన్నారు. గురువారం కండ్రిక ఎలిమెంటరీ స్కూల్‌లో ప్రగతి ట్రస్ట్ చైల్డ్ ఫండ్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేసవి శిబిరం ఆటల పోటీల విజేతలకు బహుమతులను గురువారం అందజేశారు. కార్యక్రమంలో ప్రజా ప్రగతి ట్రస్ట్ చైర్‌పర్సన్ శ్రీనివాసులు, సీనియర్ ప్రోగ్రాం ఆఫీసర్ సుధాకర్, ప్రధానోపాధ్యాయులు బి. హనుమంతరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): జూబిలీ ఇండోర్ సబ్ స్టేషన్, 11 కేవీ కస్తూరిబాయిపేట ఫీడర్ పరిధిలోని విద్యుత్ లైన్ల మరమ్మతులు, నిర్వహణ పనుల నిమిత్తం శుక్రవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని టౌన్ ఈఈ రవీంద్రబాబు ఒక ప్రకటనలో తెలిపారు. గోపాలరెడ్డి రోడ్డు సైబర్ క్రైమ్ ఆఫీస్, ఫారెస్ట్ రేంజ్ ఆఫీస్, రైల్వే క్లబ్, కస్తూరిబాయిపేట పుష్పా హోటల్ ఏరియా, కాళేశ్వరరావు రోడ్డు, ప్రకాశం రోడ్డు లతా సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఏరియా, పొగాకు బ్యారెన్ రోడ్డు, డోర్నకల్ రోడ్డు మధుసూదనరావు హాస్పిటల్ ఏరియా, కస్తూరిబాయి పేట బెల్లపు శోభనాద్రి వీధి, చలసాని వెంకట కృష్ణయ్య వీధి, కోవెలమూడివారి వీధి నందన్ హాస్పిటల్ ఏరియాలలో ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని చెప్పారు.

- మధురానగర్(విజయవాడసెంట్రల్): మధురానగర్ సెక్షన్ 11 కేవీ దేవి నగర్ ఫీడర్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతుల దృష్ట్యా శుక్రవారం ఉదయం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీసీపీడీసీఎల్ ఈఈ పి. రవీంద్రబాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దేవినగర్ ఒకటో లైన్ నుంచి ఎనిమిదో లైన్ వరకు ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని చెప్పారు.

గ్రీన్ ఫీల్డ్ హైవే పనుల పరిశీలన

విజయవాడరూరల్: ఖమ్మం-విజయవాడ గ్రీన్ ఫీల్డ్ జాతీయ రహదారి విస్తరణకు అవసరమైన పనులను వేగవంతం చేయాలని ఎన్టీఆర్ జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్. ఇలక్కియా అధికారులను ఆదేశించారు. ఖమ్మం - విజయవాడ గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారి ఎన్‌హెచ్ - 165జీ విస్తరణ పనుల్లో భాగంగా గురువారం జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియా రెవెన్యూ అధికారులతో కలిసి రాయనపాడు, పైడూరుపాడు, జక్కంపూడి గ్రామాల్లో సేకరించిన ప్రభుత్వ భూములను పరిశీలించారు. పర్యటనలో విజయవాడ రూరల్ తహసీల్దార్ బి.సుగుణ తదితరులు పాల్గొన్నారు.



గ్రీన్‌ఫీల్డ్ హైవే మ్యాప్‌ను పరిశీలిస్తున్న జేసీ ఎస్.ఇలక్కియా, అధికారులు

శాతవాహన కళాశాలను తెరిపించాలని వినతి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): సమస్యల వలయంలో చిక్కుకొన్న శాతవాహన కళాశాలను తక్షణమే తెరిపించాలని, విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలని కళాశాల సిబ్బంది, పూర్వ విద్యార్థులు కలెక్టర్‌ను వేడుకున్నారు. ఈ మేరకు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశను ఆయన కార్యాలయంలో గురువారం కలిసి వినతి పత్రం అందజేశారు. నూతన విద్యాసంవత్సరం ప్రారంభమవుతోందని, ప్రభుత్వ ఎయిడెడ్‌లో నడుస్తున్న ఈ కళాశాల స్థల వివాదం కారణంగా గేటుకు తాళాలు వేశారని కళాశాల కమిటీ అధ్యక్షుడు పిన్నమనేని కృష్ణమోహన్, పరిరక్షణ కమిటీ కన్వీనర్ వి.సాంబిరెడ్డి కలెక్టర్‌కు వివరించారు. ఏ ఒక్కరికీ కళాశాలలోనికి అనుమతించడం లేదని కలెక్టర్‌కు ఇచ్చిన వినతి పత్రంలో పేర్కొన్నారు. వేల మంది విద్యార్థులను తీర్చిదిద్దిన కళాశాలకు పూర్వ వైభవం తేవాలని కోరారు. ఎంతో మంది అడ్మిషన్ల కోసం ఎదురుచూస్తున్నారని, కళాశాలను తెరిపించే విధంగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, పరిరక్షణ కమిటీ కో-కన్వీనర్ శ్రీనివాసరావు, మోతుకూరి అరుణ కుమార్, ఎస్.సాంబశివరావు, వల్లూరు నాగబాబు, రవికిరణ్, యార్లగడ్డ రాజేష్ తదితరులు ఉన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

సంగీత సద్గురువులకు స్వర నీరాజనం



విజయవాడ కల్చరల్: సంగీత సద్గురువులు సుసర్ల దక్షిణామూర్తి శాస్త్రి 108, గాయక సార్వభౌమ పారుపల్లి రామకృష్ణయ్య పంతులు 74 వర్ధంతి సందర్భంగా శిష్యప్రశిష్యుల ఆధ్వర్యంలో దుర్గాపురం రామకోటిలోని భారతీ తీర్థ మహాస్వామి శ్రవణ సదనంలో సంగీత మహోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. కార్యక్రమాను ప్రారంభించిన కార్యక్రమ కన్వీనర్ మోదుమూడి సుధాకర్ మాట్లాడారు. కొత్తూరు శ్రీరంజని, బీవీఎస్ శ్రీ కృష్ణ, సింహపురి సోదరీమణులు ఎస్. నాగలక్ష్మి, ఆర్. పద్మావక్రవర్తి వీణ, బీవీ విద్యాసాగర్, పి. నందకుమార్‌లు వయోలిన్ సోలో, త్యాగరాజ స్వామి కృతులను ఆలపించారు. పి. జయతి, మహతి, హేమాద్రి చంద్రకాంత్, వై. గణేష్, కె. జగన్మోహిని వాద్య సహకారం అందించారు.

లారీ ఢీ కొని ఇద్దరు మహిళలకు గాయాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ద్విచక్ర వాహనంపై వెళుతున్న మహిళలను లారీ ఢీకొట్టడంతో ఇద్దరు మహిళలు గాయపడ్డారు. ఈ ఘటన గుణదల పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కండ్రికకు చెందిన దాసరి సుగుణ నున్నలో ఇంటి పనులు చేస్తూ జీవిస్తోంది. సుగుణ తన తల్లితో కలిసి పనులు ముగించుకుని బుధవారం రాత్రి ద్విచక్ర వాహనంపై తిరిగి ఇంటికి బయలుదేరింది. రాత్రి 11.30 గంటల ప్రాంతంలో ఇన్నర్ రింగ్ రోడ్డు భారత్ పెట్రోల్ బంక్ సమీపంలోని జంక్షన్ వద్ద యూటర్న్ తీసుకుని వెళుతుండగా రామవరప్పాడు వైపు నుంచి వేగంగా వస్తున్న లారీ ఢీ కొట్టింది. ఈ ఘటనలో గాయపడిన సుగుణ, ఆమె తల్లిని ఆస్పత్రికి తరలించారు. బాధితురాలు సుగుణ ఫిర్యాదు మేరకు గురువారం గుణదల పోలీసులు కేసు నమోదు చేశారు.

నగరంలో జోరువాన

గురువారం ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై ఉంది. సాయంత్రం చిరు జల్లులు కురిశాయి. రాత్రి 7.30 గంటల ప్రాంతంలో ఒక్కసారిగా వర్షం కురిసింది. పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. రాకపోకలకు ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు.
– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ



